సాగుకు సమాయత్తం



శెట్టిపల్లె గ్రామంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఖరీఫ్ సమయం ఆసన్నమైంది. రైతాంగం వరి సాగుకు సమాయత్తమయ్యారు. జూన్ ఆఖరిలో రుతు పవనాలు ప్రవేశించినా సాగుకు అవసరమయ్యే వర్షాలు కురిశాయే తప్ప పంటలు వేసుకోవడానికి కావాల్సిన వర్షాలు కురవకపోవడంతో ఇతర మార్గాల కింద వరిసాగుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. బోర్లలో నీటిసామర్థ్యం ఉన్న వారు అక్కడక్కడ వరిసాగును రైతులు చేపట్టారు. ప్రధానంగా కూలీల కొరత రైతులను వేధిస్తుండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను పిలిపించుకుంటున్నారు. సాగు ఖర్చులు పెరగడంతో వరిని వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఇప్పటికే పొలాన్ని దున్ని, సత్తువ చేసిన రైతులు ఆరుతడి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. – సంబేపల్లె



నగిరి సమీపంలో వరిపంట సాగుకు ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తున్న దృశ్యం

వరప్రదాయిని.. వైఎస్సార్ వెలిగల్లు

- కరువు నేలపై మూడు పంటలు పండిస్తున్న రైతాంగం
- పూడికతీత పనులు పూర్తయితే నిండుకుండల్లా చెరువులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



శుభ్రం చేసిన కాలువలో ప్రవహిస్తున్న నీరు



జేసీబీ సాయంతో కుడి కాలవను శుభ్రం చేస్తున్న దృశ్యం

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పుణ్యమే. ఈ ప్రాంతానికి తాగునీరు, సాగునీటికి వెలిగల్లు వరప్రదాయినిగా మారింది. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన మూడు సంవత్సరాలలో ప్రాజెక్టును పూర్తి చేసి అప్పటి ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హయాంలో ముఖ్యమంత్రి వైఎస్సార్ చేతులమీదుగా నీటిని వదిలి జాతికి అంకితం చేసి ఈ ప్రాంత రైతాంగం గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. ఒక వైపు వ్యవసాయం, మరో వైపు తాగునీటికి మరో వైపు పర్యటన కేంద్రంగా ప్రాజెక్టు నిలుస్తోంది. ఈ మధ్యకాలంలోనే నిండుకుండలా వర్షపు నీటితో కళకళలాడుతోంది. పూర్తిస్థాయిలో నీరు ప్రాజెక్టు చేరడంతో ప్రాజెక్టు స్థాయి అధికారుల ఆదేశాల మేరకు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అనేక మార్లు ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు.

ప్రాజెక్టు 55 కిలోమీటర్లు మేర కాలువ పూడిక తీసే పనులు

వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలలో దాదాపు 55 కిలోమీటర్లు వరకు కాలువలో ఉన్న పూడిక తీసే పనులను గత 20 రోజుల నుంచి చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం దాదాపు 25 కిలోమీటర్ల పనులు పూర్తి కాగా మిగితా పనులను త్వరలో పూర్తి కానున్నాయి. కాలువలో ఏర్పడిన జమ్ము, పాచి, మట్టిని యంత్రాల సహాయంతో తొలగిస్తూ కాలువలను శుభ్రం చేస్తున్నారు. కాలువలు శుభ్రంగా ఉండడంతో నీటి ప్రవాహం వేగంగా ప్రవహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు, కుంటలకు జలకళ..

ఇప్పటికే ఆ ప్రాంతంలోని చెరువుల్లో సాగుకు సరిపడా నీరు ఉండగా, పూడికతీత పనులు పూర్తయితే చెరువులకు అవసరమైన సమయాల్లో నీటి నింపే వెసులుబాటు ఉంటుంది. దీంతో వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ కింద ఉన్న చెరువులు, కుంటలు, బోరుబావులు పుష్కలంగా నీటితో కళకళలాడనున్నాయి. సాగునీటికి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు తమ పొలాలలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగుకు ఎప్పుడేగానీ నీటి ఎద్దడి రాకూడదనే సంకల్పంతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాలువలను శుభ్రం చేస్తుండడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సంవత్సరానికి మూడు పంటలు



వైఎస్సార్ పుణ్యమా అని వ్యవసాయానికి సాగునీటికి వెలిగల్లు ప్రాజెక్టు చాలా ఉపయోగపడుతోంది. ఈ ప్రాంతంలో కరువు చాయలు తొలగి వివిధ పంటలను సాగు చేసుకుంటూ సంతోషంగా ఉన్నాం. సంవత్సరానికి మూడు పంటలు సాగు చేసుకుంటున్నాం. జగన్ ప్రభుత్వానికి రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– చిన్న స్వామి, రైతు గాలివీడు

నీటి సమస్యలేదు



వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు నీటితో సంవత్సరానికి మూడు దఫాలు పంటలను సాగు చేసుకుంటున్నాం. నీటి సమస్య లేదని, చెరువులు, కుంటల్లో నీరు అడుగంటితే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ఒక్క మాట చెబితే సమస్య పరిష్కారం అవుతోంది. పంట మార్పిడి చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నాం. రైతులు ఎల్లప్పుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎం.సతీష్ కుమార్, యువ రైతు, గుండ్లచెరువు, గాలివీడు

బాధ్యతల స్వీకరణ



రమణరాజు

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంగరాజు రమణరాజు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రామిరెడ్డి పోరుమామిళ్లకు బదిలీపై వెళ్లారు. ఇదిలావుంటే రమణరాజు పూర్తి అదనపు బాధ్యతలతో ఆర్ఐఓగా కూడా విధులు నిర్వర్తించనున్నారు. వచ్చే ఏడాది జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని విలేకరులకు తెలియజేశారు.

మేధస్సు పెంపునకు పోటీ పరీక్షలు దోహదం

రాజంపేట టౌన్ : విద్యార్థుల్లో మేధస్సును పెంపొందించేందుకు పోటీ పరీక్షలు దోహదపడగలవని ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ తెలిపారు. స్థానిక బీవీఎన్ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో హిందీ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తొలుత సర్తాజ్ హుస్సేన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి పోటీ పరీక్షలు ఎక్కడ జరిగినా పాల్గొనాలని సూచించారు. పోటీపరీక్షల్లో పాల్గొంటే విద్యార్థుల వారి సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరచిన వారికి ఈనెల 31న ప్రముఖ నవలాకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకొని బహుమతులను ప్రధానం చేయనున్నట్లు సర్తాజ్ తెలిపారు. హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, శివ, శ్వేత పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెట్టు నరికేశారు.. మొద్దులు వదిలేశారు



భారీ వృక్షాన్ని నరికి అలాగే వదిలేసిన చిత్రం

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేస్టేషన్‌లోని ఫస్ట్ ప్లాట్‌ఫాంలో ఇటీవల భారీ వృక్షాలను నరికివేశారు. రన్నింగ్ స్టాఫ్ క్రూ సెంటర్ సమీపంలో భారీ మొద్దులను అలాగే పడి ఉండటం వల్ల ప్రయాణీకులు ఇబ్బందులకు గురువుతున్నారు. అలాగే రైల్వే సిబ్బంది, కార్మికులు, లోకో పైలెట్స్‌లు ఇదే ప్లాట్‌ఫాంలో నడవాల్సి ఉంటుంది. వీరికి కూడా ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళలో కరెంటు లేని సమయంలో వాటితో ప్రయాణీకులకు ప్రమాదబారినపడే అవకాశం ఉంటుందని చెపుతున్నారు. అలాగే ఎత్తివేయబడిన స్టాల్ వద్ద కూడా ఇదే పరిస్థితి. వీటి తొలిగింపులో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొద్దులు తొలగించే చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం తూర్పుపల్లెలో అన్నపూర్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో రోగులకు రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు జరిపి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అన్నపూర్ణ ఆసుపత్రి యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్‌లు

రాయచోటి అర్బన్ : రాయచోటి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 23 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు నిర్వహించారు. ఆసుపత్రిలో జరిగిన కంటివైద్య శిబిరానికి శిబిరానికి రాయచోటి, రాజంపేట, కోడూరు, పీలేరు, తంబళ్ళపల్లె, కదిరి, వాయల్పాడు, పులివెందుల ప్రాంతాలకు చెందిన రోగులు హాజరయ్యారు. శిబిరంలో వైద్యులు 40 మందికి కంటి పరీక్షలు చేసి, అందులో 23 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 35మంది కంటి రోగులకు పరీక్షలు జరిపి కంటి అద్దాలతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

గిరిజన మహాసభలను జయప్రదం చేయండి



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న గిరిజన నేతలు

రాయచోటి అర్బన్ : గిరిజనుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్న గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం నేతలు విశ్వనాథ నాయక్, లంబాడా సంఘం నేత శంకర్‌నాయక్‌లు కోరారు. ఆదివారం జిల్లాలోని రాయచోటి, రాజంపేట, కోడూరు, పీలేరు, వాయల్పాడు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని గిరిజన గ్రామాలన్నింటిలోనూ ఆ సంఘం నేతలు కరపత్ర ప్రచారం చేశారు.

ఏఐఎస్‌బీ మండలాధ్యక్షుడి ఎన్నిక



సైఫ్ అలీఖాన్‌ను అభినందిస్తున్న కాలేషా

చిన్నమండెం : అఖిల భారతవిద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బీ) మండల అధ్యక్షుడిగా సైఫ్ అలీఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషా తెలిపారు. చిన్నమండెంలోని ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో కాలేషా మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని నూతనంగా ఎన్నికైన మండల కమిటీకి ఆయన పిలుపునిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల కట్టు గుత్తపల్లె సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. జూద మాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,800 నగదును స్వాధీనం చేసుకొన్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

లక్ష్యాలను పట్టుదలతో సాధించండి



మాట్లాడుతున్న సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి

ఓబులవారిపల్లె : కృషి పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని ముఖ్యమంత్రి సలహాదారు రక్కాసి ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రైల్వేకోడూరు సాయిడిగ్రీ కళాశాల 2023 బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందనర్భంగా సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థానాలు అధిరోహించడం కష్టం కాదని తెలిపారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినని ఇదే కాలేజీలో డిగ్రీ పూర్తి చేశానన్నారు. సివిల్స్ రాయాలని పన్నెండు వేల రూపాయలతో హైదారబాదుకు వెళ్లి చాలా కష్టాలు ఎదుర్కొన్నానని చెప్పారు. ఒక పత్రికలో సబ్‌ఎడిటర్‌గా ప్రారంభమైన నా ప్రస్థానం ఇప్పుడు ముఖ్యమంత్రి సలహాదారుగా నియామకం అయ్యేవరకు సాగిందన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ తనకు చెప్పిన మూడు విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. కాన్ఫిడెన్స్, కమిట్‌మెంట్, కామన్‌సెన్స్ ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారని వీటిని ఎప్పటికీ మర్చిపోనని మీరు కూడా ఆచరించి జీవిత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రెసిడెంట్ కె.చెంగల్‌రాజు, ఎస్‌వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవల్లో రాయచోటి టాప్



మాట్లాడుతున్న క్లబ్ గవర్నర్ సుధాకర్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : సేవా కార్యక్రమాల నిర్వహణలో రాయచోటి లయన్స్ క్లబ్‌ది మొదటి స్థానమని లయన్స్ క్లబ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు కె.చిన్నపరెడ్డి, సిహెచ్ రమేష్‌నాథరెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానిక ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ రాయచోటి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. గత ఏడాది క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ ఆధ్వర్యంలో 650 సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.సుధాకరెడ్డి నూతన అధ్యక్ష, కార్యదర్శులు నిర్మల్‌కుమార్, ఇందాద్ అహమ్మద్, కోశాధికారి హరీష్‌చంద్రల చేత ప్రమాణస్వీకారం చేయించారు.

జాతరలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల



పెనగలూరు: పూజల్లో పాల్గొన్న కొరముట్ల

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లిలోని అంకాలమ్మ జాతరను పురస్కరించుకొని ఆలయంలో ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కట్టావారిపల్లి సర్పంచ్ మోహనమ్మ, శివయ్యనాయుడు దంపతుల ఆహ్వానం మేరకు ఆయన జాతరలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో పుష్కలంగా వర్షాలు కురిసి పచ్చని పంటలతో కళకళలాడాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు కొరముట్ల తెలిపారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : వత్తలూరు గ్రామ పంచాయతీలోని వడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. జాతరకు ముఖ్య అతిథిగా కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సుకుమార్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీను, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సుధాకర్ రాజు, మల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్

రాజంపేట రూరల్ : రాష్ట్ర స్థాయిలో చంద్రయాన్–3 అనే అంశంపై నిర్వహించిన పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో రాజంపేట విద్యార్థి ఆరవ భరద్వాజ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందారు. స్థానిక శ్రీసాయి విద్యాలయ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ టి.వెంకట రేణుకాదేవి మాట్లాడుతూ తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి స్పేస్ వీక్ కార్యక్రమం ఈనెల 17 నుంచి 23 వరకు నిర్వహించారన్నారు. పోటీలలో 600 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీలో 7వ తరగతి చదువుతున్న భరద్వాజ ప్రథమ బహుమతి సాధించాడన్నారు.

సేవకు సలాం



బాధ్యతగా సేవలు అందిస్తూ..



కరోనా సమయంలో కాయగూరలను అందజేస్తున్న వలంటీర్ విజయకుమార్

ఇతని పేరు బసవగారి విజయకుమార్. రాజంపేట మండలం పోలి గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వలంటీర్‌గా సేవలందించడంలో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. తన పరిధిలోని 50 గృహాలకు సేవలు అందించడాన్ని బాధ్యతగా భావిస్తూ ఫించన్ నుంచి సమస్యల పరిష్కారం వరకు తన వంతు సహకారం అందిస్తున్నాడు. వీధి దీపాల నుంచి నీటి కనెక్షన్ వరకు సంక్షేమ పథకాలు చేరవేడం నుంచి వాటిపై అవగాహన కల్పించడం వరకు ముందు వరుసలో నిలుస్తున్నాడు. కరోనా సమయంలో గ్రామస్థాయిలో విరివిగా సేవలందించి అందరికీ ఆత్మీయుడయ్యాడు. వంట సామగ్రి అందించడం, బ్లీచింగ్ చల్లడం, కూరగాయలు అందజేయడం, కరోనా బాధితుల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారికి వైద్యసేవలను అందేలా చూశాడు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులతో సఖ్యతగా ఉంటూ వారి అభినందనలు పొందాడు.

– రాజంపేట రూరల్

నాకు ప్రాణం పోశాడు



నాకు కరోనా సోకిన సమయంలో ఎంతో భయపడ్డాను. ముఖ్యంగా నాకు నోటి నుంచి రక్తం రావడంతో ప్రాణాలపై ఆశ వదులుకున్నాను. అయితే కరోనా సోకినప్పటి నుంచి నాకు ధైర్యం చెబుతూ సమయానికి సేవలందించి విజయకుమార్ నాకు తిరిగి ప్రాణం పోశాడు. నాతోపాటు గ్రామంలో కరోనా సోకిన వారికి చేసిన సేవలను ఇప్పటికీ ఎవ్వరమూ మరిచి పోలేకున్నాం.

– కోసూరి పెంచలయ్య, పోలి గ్రామం, రాజంపేట మండలం

రేపు వాహనాల వేలం

కలికిరి: కలికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ కె.రహీముల్లా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్, నాటు సారా కేసులలో పట్టుబడిన 14 వివిధ రకాల వాహనాలకు సంబంధించి మంగళవారం ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.4వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి డైట్ కేంద్రంలో పీఆర్‌సీటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఆర్‌సీ బకాయిలు, పాత డీఏలన్నీ కలిపి చెల్లించాలన్నారు. నాడు – నేడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చక్కటి వాతావరణం కల్పించినప్పటికీ ఉపాధ్యాయుల కొరత వలన విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. విద్యార్థులతో సంఖ్యతో పని లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గం నిర్వహించి గౌరవాధ్యక్షుడిగా వెంకట్రామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పక్కీరప్పలను ఎన్నుకున్నారు. సమావేశంలో శివయ్య, వేణుగోపాలరావు, జయన్న దుర్గేశ్వర రాజు, రామచంద్రరాజు, షామీర్, నారాయణరెడ్డి, ఆర్‌వీ రమణ, లక్ష్మి, రమణయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడమే మానవత లక్ష్యం

లక్కిరెడ్డిపల్లె : ఆపదలో ఉన్నవారిని ఆపన్నహస్తంలా ఆదుకోవడమే మానవత ముఖ్య ఉద్దేశమని మానవత కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహించిన మానవత నూతన కార్యవర్గ ఎంపిక సమావేశానికి సహదేవరెడ్డి హాజరై మాట్లాడారు. మానవత స్వచ్ఛంద సంస్థను సమష్టి కృషితో ముందుకు తీసుకెళ్లి పేద ప్రజలకు అండగా నిలిచే విధంగా కృషి చేయాలన్నారు.

మానవత నూతన కార్యవర్గం ఎంపిక..

మానవత నూతన అధ్యక్షుడిగా వివి రమణరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.మల్‌రెడ్డి, సెక్రటరీగా రాముడు, ట్రెజరర్‌గా రవిశంకర్, జాయింట్ సెక్రటరీగా వాసుదేవుడు, ఈపీ అవేర్‌నెస్‌గా ఆంజనేయులు, ఏపీ ఎమర్జెన్సీ సభ్యుడిగా ఫరీద్ బాబా, ఎడ్యుకేషన్ సుబ్బారెడ్డి, హెల్త్ కృష్ణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సహదేవరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో మానవత నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయాలు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు. అమ్మవారి దర్శనం కోసం గంటలకొద్ది వేచి చూడాల్సి వచ్చింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ఈఓ రవీంద్రరాజులు భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

నల్లగంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు జరిపారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



అమ్మవారికి పొంగళ్లు తీసుకొస్తున్న మహిళలు



గంగమ్మ దర్శనానికి క్యూ లైన్‌లో వేచివున్న భక్తులు

ధనకొండమ్మకు పొంగళ్లు

చిట్వేలి : మార్గోపల్లి పంచాయతీ గుడ్లవారిపల్లిలో వెలసిన ధనకొండమ్మకు ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, బలులను అర్పించారు. గ్రామంలో బంధువులు, సన్నిహితులతో గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.